క్లుప్తంగా

చిన్నారులకు అర్థమయ్యేలా బోధన



మాట్లాడుతున్న ఆశ వర్కర్, అంగన్‌వాడీ కార్యకర్త

అల్లిపురం : ప్రారంభ బాల్య సంరక్షణ, విద్యపై మిరపకాయల వీధి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అవగాహన కల్పించారు. ఆశ వర్కర్ బుద్దా లీలావతి, అంగన్‌వాడీ కార్యకర్త ఎస్.రాణి పుష్పవల్లి చిన్నారులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. 8 సంవత్సరాల లోపు వయస్సులోనే అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం, సృజనాత్మకత, భావోద్వేగాలు తదితర అంశాలు వివరించాలన్నారు. ఆటలతో చిన్నారులకు అర్థమయ్యేలా బోధించాలన్నారు. అదేవిధంగా వస్తువుల ఆధారంగా వాటిని గుర్తించడం, నిత్య జీవితంలో వాటి ఉపయోగం, వినియోగం వివరించారు.

వాజ్‌పేయి జీవితం యువతకు ఆదర్శం



మహిళకు చీర అందిస్తున్న సోము వీర్రాజు

మహారాణిపేట : భారతరత్న, మాజీ ప్రధాని స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా మహారాణిపేట ప్రకృతి చికిత్సాలయ ఆవరణలో పేద మహిళలకు సోమవారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ ఆంధ్రప్రదేశ్ మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు ముందుగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే గొప్ప నేత వాజపేయి అని కొనియాడారు. నదుల అనుసంధానం, ఫోఖ్రాన్ అణుపరీక్ష చేపట్టి దేశానికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చారని గుర్తు చేశారు. కార్గిల్ యుద్ధంలో విజయం సాధించారని గుర్తు చేశారు. నేటి యువత వాజ్‌పేయి, స్వామి వివేకానంద అడుగుజాడల్లో ప్రయాణించాలని సూచించారు. ప్రకృతి చికిత్సాలయ అధినేత డాక్టర్ శిష్లా లక్ష్మీనారాయణ, డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి, ఎస్.మహేష్ చాతుర్య, రూపాకుల రవికుమార్, టి.గిరిజ, మరగడ గౌరీ రెడ్డి, ఆదినారాయణ, రమణ, మంగ బంగారమ్మ, సన్యాసిరావు, కేశవ పాల్గొన్నారు.

రహదారులు శుభ్రంగా లేకుంటే చర్యలు



లక్ష్మీటాకీస్ వద్ద పరిశీలిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ : రహదారులు పరిశుభ్రంగా ఉండాలని జీవీఎంసీ జోన్ - 4 జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడు ఆదేశించారు. జీవీఎంసీ 39వ వార్డు పరిధి లక్ష్మీ టాకీస్, రాణిబొమ్మ జంక్షన్, పంజారోడ్డు ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహదారులు పక్కన చెత్త ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కూత వేటు దూరంలోనే డంపింగ్ యార్డు, కార్మికులు, వాహనాలు ఉన్నప్పటికీ ఎందుకు రహదారులపై చెత్త ఉంటుందని ప్రశ్నించారు. పబ్లిక్ హెల్త్ అధికారులు రోజూ వార్డుల్లో పర్యటించి ఎవరు విధులు నిర్వహించలేదో రిపోర్టు ఇవ్వాలన్నారు. అనంతరం కాలువలు పరిశీలించారు. కాలువల్లో రోజూ చెత్త తొలగించి, శుభ్రం చేయాలని సూచించారు. వార్డు ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షించాలన్నారు. అదేవిధంగా వాణిజ్య సముదాయాల వద్ద చెత్త డబ్బాలు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. కొన్ని దుకాణాల వద్ద డస్ట్‌బిన్లు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. దుకాణదారులకు స్వయంగా అపరాధ రుసుము విధించారు. పర్యటనలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాల అడ్డా



31వ వార్డు కార్యాలయం, సచివాలయం, ట్రిబుల్ ఆర్ సెంటర్ నిర్వహిస్తున్న భవనం

- జీవీఎంసీ 31వ వార్డు కార్యాలయంలో మందుబాబుల చిందులు
- సాయంత్రంకాగానే చీకటి వ్యవహారాలు
- ట్రిబుల్ ఆర్ సెంటర్ నిర్వహణ మరిచిన కూటమి ప్రభుత్వం



మందుబాబులకు అడ్డాగా మారిన వార్డు పాత కార్యాలయం

డాబాగార్డెన్స్ : మందుబాబుల చిందులు.. చీకటి వ్యవహారాలు.. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది జీవీఎంసీ పరిధిలోని ఓ వార్డు కార్యాలయం. ఆ వార్డు కార్యాలయం నగర నడిబొడ్డున ఉన్నప్పటికీ అటుగా పెద్దగా జన సంచారం లేకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. సాయంత్రం వేళ చీకటి పడగానే మందుబాబులు అక్కడ వాలిపోతున్నారు. రాత్రి పొద్దుపోయే వరకు మద్యం సేవిస్తూ చిందులేస్తున్నారు. అక్కడితో ఆగకుండా చీకటి వ్యవహారాలు కూడా సాగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ తతంగమంతా జరుగుతోంది జగదాంబ జంక్షన్‌కు కూతవేటు దూరంలోని 31వ వార్డు కార్యాలయంలోనే... అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు అటువైపు కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదు.

కార్యాలయానికి భద్రత శూన్యం

జీవీఎంసీ 31వ వార్డు కార్యాలయానికి అసలు భద్రతే లేదు. పగటి వేళ ఎవరైనా.. ఎప్పుడైనా రావొచ్చు, పోవచ్చు అన్నట్టుంటుంది. ఇక సాయంత్రమైనా సరే అదే పరిస్థితి. ఈ కార్యాలయ గేటుకి తాళాలు, వాచ్‌మెన్ లేకపోవడం వల్లే ఇలా జరుగుతోందని పలువురు అంటున్నారు. మరోవైపు దీని పక్కనే వార్డు పాత కార్యాలయం కూడా ఉంది. ఈ రెండు భవనాల చుట్టూ ఉన్న ఖాళీ స్థలం ఆకతాయిల అడ్డాగా మారింది. ఇంత జరుగుతున్నా ఈ వార్డు కార్యాలయాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వార్డు కార్పొరేటర్ ఇటువైపు ఏ రోజూ చూసిన పాపాన పోలేదు. అక్కడ పనిచేస్తున్న సిబ్బందీ పట్టించుకోవడం లేదు. ఈ వార్డు పరిధిలోనే జోనల్ కార్యాలయం కూతవేటు దూరంలోనే ఉంది. అయినప్పటికీ జోనల్ కమిషనర్ కూడా ఇటువైపు చూడడం లేదు.

నాడు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్రిబుల్ ఆర్ సెంటర్

నేడు



కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో మూతపడిన సెంటర్

మూలకు చేరిన ట్రిబుల్ ఆర్ సెంటర్

వ్యర్థాల నిర్వహణకు అత్యంత కీలకమైన రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్ (ట్రిబుల్ ఆర్ సెంటర్) పద్ధతిని ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం నగరంలో చేపట్టిన అనేక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. జీవీఎంసీ పరిధి ఎనిమిది జోన్లలో ప్రజలకు అందుబాటులో ఉండేలా ట్రిబుల్ ఆర్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ వ్యర్థాల పునర్వినియోగం పట్ల ప్రజల ఆలోచన ధోరణిలో మార్పు తీసుకొచ్చింది. జోన్ - 4 పరిధి జగదాంబ జంక్షన్‌కు కూతవేటు దూరంలో గల 31వ వార్డు కార్యాలయంలో 'ఉమెన్స్ రెస్టో కేఫ్'ని ఆహ్లాదకర వాతావరణంలో ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌లో వ్యర్థాలతో తయారు చేసిన వస్తువులు ప్రదర్శించారు. అంతవరకూ వైఎస్సార్ సీపీ పాలనలోనే అంతా మంచిగానే జరిగింది. కొన్ని నెలల కిందట కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆయా సెంటర్లను ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా 31వ వార్డులో ఏర్పాటు చేసిన ట్రిబుల్ ఆర్ సెంటర్ మూలకు చేరుకుందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

గృహ హింస బాధితురాలికి ఆశ్రయం

సీతమ్మధార : గృహహింస కారణంగా రోడ్డున పడిన ఒక గృహిణికి జీవీఎంసీ నిరాశ్రయుల వసతి గృహంలో సోమవారం ఆశ్రయం కల్పించారు. ఏయూటీడీ సంస్థ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లాకు చెందిన బొత్స రోహిణి (38) తండ్రి రెండో పెళ్లి చేసుకోవడంతో సవతి తల్లి వేధింపులు భరించలేక ఇల్లు వదిలి వైజాగ్ వచ్చేసింది. రోడ్డు మీద కూడా ఆకతాయిల వేధింపులు భరించలేక డాబాగార్డెన్స్‌లో గల ప్రేమసమాజానికి వెళ్లింది. వారు నేరుగా ద్వారకానగర్‌లోని టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ – జీవీఎంసీ మహిళా నిరాశ్రయుల వసతి గృహానికి తరలించారు. తనకి షెల్టర్ ఇవ్వడంతోపాటు, చుట్టూ ఉన్న వ్యాపార సముదాయాల్లో ఉపాధి చూసుకుని హాస్టల్ చూసుకోమని సిబ్బంది చెప్పారు. వసతిగృహం మేనేజర్ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో షెల్టర్ సిబ్బంది, కేర్ టేకర్ లీలా ఆమెకి ఆశ్రయం కల్పించారు.

అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 2711725, 2566514లో సంప్రదించాలి.

నేటి నుంచి లేపాక్షిలో థీమాటిక్ ప్రదర్శన

డాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ హస్తకళాభివృద్ధి సంస్థ ఎండీ విశ్వ సూచనల మేరకు మంగళవారం నుంచి 11వ తేదీ వరకు జగదాంబ జంక్షన్ సమీపాన గల లేపాక్షి షోరూంలో థీమాటిక్ ప్రదర్శన నిర్వహించనున్నట్టు లేపాక్షి హ్యాండిక్రాఫ్ట్స్ ఎంపోరియం మేనేజర్ కార్తీక్ కుమార్ తెలిపారు. వివిధ రాష్ట్రాల హస్తకళాకారులు రూపొందించిన కళాఖండాలు విక్రయించనున్నారన్నారు. ప్రదర్శన ద్వారా స్థానిక కళలకు ప్రోత్సాహం లభిస్తుందని కార్తీక్ కుమార్ తెలిపారు. ప్రదర్శనలో పెన్ కలంకారీ పెయింటింగ్ (శ్రీకాళహస్తి), బనానా ఫైబర్ ఉత్పత్తులు (కడప), సవర ఆదివాసీ పెయింటింగ్ (మన్యం), ఏటికొప్పాక లక్క బొమ్మలు(అనకాపల్లి), వైట్ ఉడ్ బర్డ్స్ (రాజమహేంద్రవరం) చేతి వృత్తి బొమ్మలు ప్రదర్శన, విక్రయాలు ఉంటాయన్నారు.

స్టీల్‌ప్లాంట్ అమ్మడం లేదని ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌కేఎస్‌వీ కుమార్

డాబాగార్డెన్స్ : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విశాఖ పర్యటన సందర్భంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మడం లేదని ప్రకటించాలని సిటూ విశాఖ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ నూటికి నూరు శాతం ప్రైవేటీకరణ చేస్తామని ప్రకటించిన నాటి నుంచి నేటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక వర్గం విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అని పెద్ద ఎత్తున పోరాడుతోందని సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం జగదాంబ జంక్షన్ సమీపాన గల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయమై అనేక సందర్భాల్లో మంత్రుల దృష్టికి, ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. 32 మంది ప్రాణత్యాగాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తామంటే ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ఒప్పుకోరన్నారు. ప్రైవేటీకరణ చేయడం లేదని మోదీ విశాఖ పర్యటన సందర్భంగా ప్రకటించాలని కోరారు. దేశంలో ఉన్న అన్ని స్టీల్‌ప్లాంట్లకు సొంత గనులున్నాయని, విశాఖ కర్మాగారానికి మాత్రం సొంత గనులు కేటాయించకుండా నష్టాల ఊబిలోకి నెట్టేసే కుట్రను ప్రభుత్వం కావాలనే అమలు చేస్తోందని ఆరోపించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

గాంధేయ మార్గ పోరాటంతో రైల్వే జోన్


- ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి చలసాని గాంధీ
- నాలుగు దశాబ్దాల కల సాకారమవుతున్న వేళ..
- ప్రధాని మోదీ చేతుల మీదుగా రేపు శంకుస్థాపన



మాట్లాడుతున్న చలసాని గాంధీ

డాబాగార్డెన్స్ : గాంధేయ మార్గ పోరాటమే రైల్వే జోన్ సాధించి పెట్టిందని, నాలుగు దశాబ్దాల పోరాటానికి ఈ నెల 8న ప్రధాని నరేంద్ర మోదీ ఉత్తరాంధ్ర జిల్లాల వాసుల కళ నెరవేర్చనున్నారని అఖిల భారత రైల్వే ఉద్యోగుల సమాఖ్య మాజీ ఉపాధ్యక్షుడు, ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి చలసాని గాంధీ తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మీడియాతో మాట్లాడారు. రైల్వే జోన్ కోసం గొతు లచ్చన్న, బాట్టం శ్రీరామమూర్తి, ద్రోణంరాజు సత్యనారాయణ, కింజరాపు ఎర్రన్నాయుడు, కమ్యూనిస్టు నాయకులు సీహెచ్ నరసింగరావు, జేవీ సత్యనారాయణమూర్తి..ఇలా ఎందరో ప్రజాప్రతినిధులు, కార్మిక నాయకులు 40 ఏళ్లుగా ఉద్యమాన్ని సజీవంగా ఉంచారన్నారు. ఎన్నికల ప్రణాళికలో ప్రధాన అంశంగా ఉండడమే గాక వాల్తేర్ డివిజన్‌తో కూడిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ తక్షణం ప్రారంభించాలని విశాఖ ఎంపీ కృషి చేశారన్నారు. ఉత్తరాంధ్రలోని వాల్తేర్ డివిజన్‌పై ఎప్పుడూ వివక్షేనని, కొత్త ప్రాజెక్టుల మంజూరు నుంచి కొత్త రైలు మార్గాలు, కొత్త రైళ్లు, అదనపు బెర్తులు, కొత్త పోస్టులు, ఉద్యోగ నియామకాలు..ఇలా అన్నింట్లోనూ ఆగ్నేయ రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే ఆధ్వర్యంలో బాగా అన్యాయానికి గురయ్యామన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో రైల్వే జోన్ ప్రస్తావన ఉన్నా, వివిధ కారణాలతో ఇప్పటి వరకు ఆంధ్రుల కల నెరవేరలేదన్నారు. జోన్ ప్రారంభోత్సవం అవ్వగానే కార్యకలాపాలు ప్రారంభించడానికి అవసరమైన భవనాలు ఇప్పటికే విశాఖలో సిద్ధంగా ఉన్నాయన్నారు. రైల్వే జోన్ ఏర్పాటైతే కొత్త ప్రాజెక్టులు, ప్రొడక్షన్ యూనిట్లు, వర్క్‌షాప్‌లు మంజూరవుతాయన్నారు. కొత్త రైలు మార్గాలు, కొత్త రైళ్లు, స్టేషన్లు, అదనపు బెర్త్‌లు వస్తాయని, విశాఖ నుంచి న్యూఢిల్లీకి రాజధాని ఎక్స్‌ప్రెస్ వస్తుందన్నారు.

నివాస హక్కుల ఉద్యమ సవాళ్లపై 9న సదస్సు



కరపత్రాలు ప్రదర్శిస్తున్న ప్రజా సంఘాల నేతలు

సీతమ్మధార : విశాఖ నివాస హక్కుల పోరాట దినం సందర్భంగా వర్తమానంలో నివాస హక్కుల ఉద్యమ సవాళ్లు - కర్తవ్యాలు అనే అంశంపై సదస్సు 9న నిర్వహిస్తున్నామని పీవోడబ్ల్యూ నాయకురాలు లక్ష్మి తెలిపారు. ఎంఎస్ఎస్ఎస్, పీవోడబ్ల్యూ నగర కమిటీలు సంయుక్తంగా రైల్వే న్యూ కాలనీ దరి సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో నిర్వహించే సదస్సుకు కర్ణాటక హైకోర్టు న్యాయవాది, కార్మిక సంఘాల నాయకుడు కామ్రేడ్ బాలన్, జె.వి.చలపతిరావు, వీవీ రమణ మూర్తి, టి.శ్రీరామ్మూర్తి, ఎస్‌వీ రమణ హాజరవుతారని తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆర్టీసీ కాంప్లెక్సు దరి జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద సోమవారం ఆవిష్కరించారు. 2012లో చేపట్టిన పోరాటానికి గుర్తుగా జనవరి 9న విశాఖ నివాస హక్కుల పోరాట దినంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ దేశాన్ని కార్పొరేట్ల పరం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. పేద ప్రజల జీవన స్థితిగతులను మార్చడానికి మాత్రం చర్యలు చేపట్టడం లేదన్నారు. ఎస్.వెంకటలక్ష్మి, రోహిణి దేవి, లక్ష్మి, పరదేశి, కె.బాలనాగమ్మ తదితరులు పాల్గొన్నారు

గురు గోవింద్‌సింగ్ బోధనలు అనుసరణీయం

సీతమ్మధార : గురు గోవింద్‌సింగ్ బోధనలు అనుసరణీయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. స్థానిక గురుద్వారలో గురుగోవింద్ సింగ్ జీ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరికీ సేవ, సమానత్వం, న్యాయం గురించి నొక్కి చెప్పే గురు గ్రంథ్ సాహిబ్ బోధనలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని కోరారు. వాహే గురువు ఆశీస్సులు పొందేందుకు తనకు అవకాశం కల్పించినందుకు కమిటీ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. అంతకు ముందు ఆమెకి గురుద్వారా కమిటీ ప్రతినిధులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆమెకి కత్తి, జ్ఞాపిక అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. బీజేపీ నాయకురాలు శ్యామలా దీపికను కూడా జ్ఞాపిక, శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సిఖ్ మిషన్ రాష్ట్ర ఇన్‌ఛార్జి డాక్టర్ డీఎస్ ఆనంద్, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఐపీటీలో శ్రీచైతన్య విద్యార్థుల విజయకేతనం



ఐపీటీలో ప్రతిభ చూపిన విద్యార్థులతో శ్రీచైతన్య స్కూల్ ప్రతినిధులు

సీతమ్మధార : ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఐపీటీ జాతీయ స్థాయి పరీక్షకు రాష్ట్రం నుంచి 19 మంది విద్యార్థులు ఎంపికవగా.., వారిలో 18 మంది శ్రీ చైతన్య విద్యార్థులని ప్రిన్సిపాల్ రవికిరణ్ తెలిపారు. వారిలో ద్వారకానగర్‌లో గల శ్రీ చైతన్య స్కూలు విద్యార్థులు ఆరుగురున్నారని తెలిపారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఏజీఎం సురేష్, ప్రాంతీయ పర్యవేక్షకులు మహమ్మద్ ఆలీ, అకడమిక్ ఎగ్జిక్యూటివ్ కో ఆర్డినేటర్ రాజేష్ ప్రశంసాపత్రం, శ్రీ చైతన్య గోల్డ్‌మెడల్స్ అందించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల డీన్లు గౌరినాయుడు, సురేష్ పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ ఆపే వరకూ పోరాడతాం

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపే వరకు పోరాడుతామని సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు సీహెచ్ పద్మనాభరాజు అన్నారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆస్పత్రి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 98వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటీకరణ టెండర్‌కు ఎవరొచ్చినా అడ్డుకుని తీరాలని, తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. పోర్టు యాజమాన్యమే ఆస్పత్రిని నిర్వహించాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే కార్మికులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. బి.జగన్, కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, శంకరరావు, కేఎస్ కుమార్, రాఘవులు, విజయ్‌కుమార్ నాయుడు పాల్గొన్నారు.

మేడ పైనుంచి జారిపడి వ్యక్తి మృతి

సీతమ్మధార : మేడ పైనుంచి జారిపడి ఓ వ్యక్తి మరణించాడు. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రైల్వే న్యూ కాలనీ కనకారావు వీధి బలరామ్ అపార్ట్‌మెంట్‌లో భార్య, ఇద్దరు పిల్లలతో దల్లి డేవిడ్ (38) నివసిస్తున్నారు. నగరంలోని ఓ వస్త్ర దుకాణంలో సేల్స్‌మేన్‌గా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో పిల్లల కోసం ఆయన సోమవారం రాత్రి గాలిపటం కొనుగోలు చేశారు. అనంతరం మేడ మీద గాలిపటం ఎగుర వేస్తుండగా, కాలుజారి కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయలు తగలడంతో అక్కడికక్కడే మరణించాడు. భార్య అనూష ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. ఈ కేసుని నాలుగో పట్టణ సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో ఏఎస్ఐ లక్ష్మం నాయుడు దర్యాప్తు చేస్తున్నారు.

వాసుపల్లిని కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు



వాసుపల్లి గణేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ 37వ వార్డు నాయకులు

డాబాగార్డెన్స్ : మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ విశాఖ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్‌ను ఆ పార్టీ 37వ వార్డు నాయకులు, కార్యకర్తలు సోమవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. నియోజకవర్గానికి నిరంతర ప్రజా సేవకుడు వాసుపలి గణేషకుమార్ అని, కార్యకర్తలు, నేతలతోపాటు నియోజకవర్గ ప్రజలను సొంత కుటుంబ సభ్యులుగా భావించి కష్టనష్టాల్లో అండగా ఉండడం మా అదృష్టమని కొనియాడారు. వాసుపల్లి అధికారంలో లేని లోటు ప్రజలకు ఇప్పుడిప్పుడే కనిపిస్తోందని, ప్రజలను మభ్యపెట్టి గెలిచిన నేతలు కనుమరుగవ్వడం ఖాయమన్నారు. రెయ్యి రేవతి డేవిడ్‌రాజు, గనగల రామరాజు, ముత్యాల కమల్ మనోహర్, చొక్కాకుల శ్రీనివాస్, రోజా రమణి, వద్దాది మహేష్, శేషగిరి, సాల్మన్, ప్రశాంత్, దిలీప్, రమేష్, సరోజని, రాజు, ప్రమీల, చెన్నా సుబ్రహ్మణ్యం, దినేష్, వర్మ తదితరులు పాల్గొన్నారు.


మహిళకు వాసుపల్లి రూ.10 వేల సాయం



మహిళకు ఆర్థిక సాయం అందిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్, తోట పద్మావతి, తదితరులు

అల్లిపురం : అనారోగ్యంతో బాధపడుతున్న ఓ పేద మహిళ ఇంటికి మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ వెళ్లి పరామర్శించి... మందుల ఖర్చులకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందించి ఉదారత చాటుకున్నారు. జీవీఎంసీ 34వ వార్డు శెట్టిబలిజ వీధికి చెందిన గండిబోయిన కనకరాజు భార్య అర్జునమ్మ (36) ఇటీవల అపెండిసైటిస్ ఆపరేషన్ చేయించుకున్నారు. అయితే మందులు కొనుక్కోలేని పరిస్థితి నెలకొనడంతో స్థానిక నాయకులు అందించిన సమాచారం మేరకు వార్డు కార్పొరేటర్ తోట పద్మావతితో కలిసి సోమవారం అర్జునమ్మ ఇంటికి వాసుపల్లి చేరుకుని పరామర్శించారు. ఆమె ఆరోగ్యం మెరుగుపడాలని ఆకాంక్షించారు. అవసరమైన మందులు కొనుగోలు కోసం రూ.10వేలు అందజేసి భరోసా కల్పించారు. అంతేకాకుండా ఆమె పిల్లల చదువుకు అయ్యే ఖర్చులు కూడా తానే చూసుకుంటానని హామీ ఇచ్చారు. దీంతో బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులు వాసుపల్లి గణేష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.
ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి, స్థానిక నాయకులకు ప్రజల సమస్యలు పట్టడం లేదన్నారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు పెద్దపీట వేశారన్నారు. అనేక సంక్షేమ ఫలాల నగదు నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. ఆ డబ్బులతో ఇంటిని నడిపే వారని, జగనన్న అందించిన సంక్షేమ ఫలాలు చేదోడు వాదోడుగా ఉండేవన్నారు. ఆయన వెంట ఎర్నిమాంబ ఆలయ కమిటీ చైర్మన్ లండ రమణ, లింగం శ్రీను, వైఎస్సార్ సీపీ 29వ వార్డు అధ్యక్షుడు పీతల వాసు, ముత్తబత్తుల రమేష్, సౌత్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్ ఖాన్, మాజీ డైరెక్టర్ సనపల రవీంద్రభరత్, దూడ అప్పారావు, అనిల్, కడవల నాగమణి, అంబటి అప్పలరాజు, వాసుపల్లి ధనరాజ్, గోవింద్, బేవార్, మహేష్, చింతకాయల వాసు, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ కార్యవర్గం



ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

మహారాణిపేట : కేజీహెచ్‌లో ఆంధ్రప్రదేశ్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం జరిగాయి. ఎన్నికల రాష్ట్ర పరిశీలకులు ఆర్‌వీఎస్ఎన్ మూర్తి, దురాణి, కిషోర్, సుధాకర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడిగా ధర్మాల రాజశేఖర్ రెడ్డి, సెక్రటరీగా సరగడ ఈశ్వర రావు, కోశాధికారిగా విప్పర్తి లక్ష్మీ నారాయణ, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారని తెలిపారు.